# చిగురు తొడిగింది

రిక్షావాణ్ణి పుస్తకాలు లోపల పెట్టమని చెప్పి, చెప్పులు వదలి లోపలికెళ్లి ఒక గ్లాసుడు మంచినీళ్లు త్రాగింది కుసుమ. వాడు పుస్తకాలు లోపల పెట్టగానే డబ్బిచ్చి పంపేసింది. పడక్కుర్చీలో అలా వాలిపోయి కళ్ళు మూసుకుంది. పావుగంట గడిచేవరకు అల్లాగే పడుకుంది. ఇప్పుడు లేచి కాఫీ చేసుకోవాలని తోచేసరికి, కొంచెం నీరసం ఎక్కువైంది. కానీ తప్పదు. లేచి చేతులు, కాళ్ళు కడుక్కోవడానికి లోపలికి వెళ్ళింది. అత్తగారు వంటింట్లో పీట మీద బియ్యం పోసుకొని ఏరుకుంటోంది. ఆవిడ పుణ్యమాని యీ వేళ రాళ్ళు నమలనఖ్ఖరలేదు కాబోలు. కుసుమ అవతలికి వెడుతోంటే తలెత్తి చూచి తలవంచుకుందావిడ.

ఇప్పట్నించీ ఎనిమిది గంటలకి ఆయన వచ్చేవరకు యిల్లాగే గడపాలి. కాంపోజిషను పుస్తకాలు నూటయాభై వున్నాయి. వాటితో గడపాలి. ముఖం కడుక్కుని వచ్చి స్టవ్ అంటించి నీళ్ళు పెట్టింది. అత్తగారు మధ్యాహ్నం మూడింటికల్లా త్రాగేస్తుంది కాఫీ. అప్పుడే ఒక చెంచాడు పొడుం ఆ ఫిల్టరులో వేస్తే బాగుండును. రాగానే తను కలుపుకొని తాగుతుంది. కాఫీపొడి, పంచదార తెచ్చి స్టవ్ ప్రక్కని పెట్టింది కుసుమ.

"ఈ పూట కూర ఏమీ లేదు. తెప్పిస్తే వండుతాను" అన్నది ముసలావిడ బియ్యం గిన్నెలో పోస్తూ. కుసుమ మాట్లాడలేదు. ఎవరితో తెప్పిస్తుంది. తనే వెళ్లాలి. సాయంత్రం నాలుగున్నర వరకూ యిక్కడే వుంటుంది పనిమనిషి. దానితో తెప్పించరాదూ, ఏం తెప్పించాలో. ఎంత తెప్పించాలి అంటూ సాగదీస్తుందావిడ. అలమారు తాళం వేసి, తాళం చెవి పట్టుకెడుతుంది తను. డబ్బుండదు ఎలా తెప్పించేదీ అంటుంటే కూడా విన్నది. కూర లేదని చెబితే ఒక పావలా యిచ్చే వెడుతుందిగా తను.

డికాక్షన్ వేసి, పెరట్లోకి వెళ్ళింది. తెల్ల జాకెట్టు తూము గట్టు మీద పడి పోయింది. కాస్తుంటే బురదలో పడి పోయేదే. చీరెలు లుంగచుట్టుకుపోయి వ్రేలాడుతున్నాయి. అవన్నీ తీసుకుని భుజం మీద వేసుకుని లోపలికి వచ్చింది. రంగు చీరెలు ఎండలో ఉంచవద్దు మధ్యాహ్నానికల్లా తీసేయాలి అంటూ తను ఒకటి రెండు సార్లు అన్నది ఆవిడతో.

కాఫీ కలుపుకుని త్రాగి యివతలికి వచ్చేసింది. పత్రిక చదువుతూ కూర్చుంది. "మరి కూర తెప్పించడం లేదా కుసుమా?" అన్నది ఆవిడ ఒక అరగంట తర్వాత గుమ్మం దగ్గరికి వచ్చి. కుసుమ లేచి పత్రిక అవతల పడేసింది. కొంచెం ఆగి ఆవిడ "ఈవేళ ఏకాదశి. నేనెల్లాగు భోంచేయను. నాలుగు బంగాళా దుంపలున్నాయి. వేయించమంటే వేయిస్తాను" అన్నది. మళ్ళీ కొంచెం ఆగి, "మట్టివాసన వేస్తున్నాయి దుంపలు అంటున్నాడు వాడు" అన్నది.

"పట్టుకొస్తానులెండి" అంటూ బయలుదేరింది చిన్న ప్లాస్టికు బుట్టపట్టుకుని. అసలతనితో ముందే చెప్పింది యీ వంట, తాపత్రయం నేను పడలేననీ, కారియర్ తెప్పించుకుందామని. ఎక్కడో కూతురు దగ్గర వున్న ఆవిడని రారమ్మంటూ పిలుచుకువచ్చారు. ఒకరికిద్దరైతే ఒకటే సంసార తాపత్రయం.

తిరిగి యింటికి చేరేసరికి ఆరున్నరైంది. బీరకాయలు లోపల పడేసి, మళ్లీ యివతలికి వచ్చింది. రేడియో త్రిప్పి, మంచం మీద దుప్పటి మార్చింది. అక్కడక్కడా పడి వున్న పుస్తకాలు, కాగితాలు సర్దింది. సాయంత్రం ఆయన పెందరాళే రారు. స్నేహితుడి కంపెనీకి వెళ్లి కూర్చుంటారు అక్కౌంట్సులో సహాయం చేయాలంటూ. ఆయన వచ్చేది ఎనిమిదింటికి. ఈవిడ వండేది ఐదున్నరకి. రోజూ చల్లారిపోవడమే! ఈవేళ యింకా నయం. ఆయన విసుక్కుంటారు కూడాను.

కుసుమ పుస్తకాలు దిద్దుకుంటూ కూర్చున్నది. వాసు ఎనిమిది మ్ముప్పావుకి సుమారుగా వచ్చాడు. పొట్లం విప్పి మల్లెపూల చెండు ఒకటి ఆమె బుగ్గలకు తాకేలాగ విసిరాడు. మరో అరగంట వరకు అతను కబుర్లు చెబుతూ బట్టలు మార్చుకోవడం, ఆమె కూడా ఏవో విశేషాలు చెప్పడంతో గడచింది.

అన్నం పెట్టగానే అతను "ఏమిటీ పత్యం కూర?" అన్నాడు. తనేమీ మాట్లాడలేదు. తర్వాత వేరే కబుర్లలో పడ్డారు. "అమ్మేదీ?" అనడిగాడు చేయి కడుక్కుని లేస్తూ.

"ఏకాదశి - భోంచేయరు" అని చెప్పింది కుసుమ. అన్నం తినీతినగానే ఎంత బద్ధకంగా ఉంటుందో. రోజూ ఆవిడ చివరికి తిని, కంచాలు తీసి కడుగుతుంది. తను మొదట్లో తనదీ, ఆయనదీ కంచాలు తీసేది. క్రమేపీ ఆ అలవాటు కూడా పోయింది. వక్క వేసుకుని కాస్సేపాగి వద్దామని పెరుగు గిన్నె మాత్రం లోపల పెట్టేసి అవతలికి వెళ్ళింది.

అలమరలోంచి పెరుగు గిన్నె తీసి, గుమ్మం దగ్గరగా పెట్టి, కాసిని నీళ్లు పోసి మజ్జిగ చేసుకుంది మాణిక్యమ్మ. ఏకాదశి చేయడం కష్టంగా వున్నది. తన ఒక్కత్తి కోసం ఫలహారం చేసుకోవాలనిపించదు. పనిది అన్నది మామిడి పళ్ళు యింకా వస్తూనే ఉన్నాయండీ అని. నిన్నటివరకు ఉన్నాయి. ఈవేళకే లేకపోయింది. కూరకోసం యిచ్చే చిల్లరకూడా యీ వేళ లేకపోయింది. పండు తెప్పిద్దామంటే.

కాస్త పంచదార కలుపుకుంది ఆ మజ్జిగలో. లేకపోతే గొంతుకంతా పట్టుకున్నట్లుంటుంది. మజ్జిగ గిన్నె కడిగి మళ్లీ లోపల పెట్టింది. అర్ధరాత్రి ఔతుంది. అందరూ పడుకునే వేళ, మనం తిరిగే వేళ ఎంగిళ్ళు అలా వుంటే తోచదు. కంచాలు రెండు పంపు దగ్గర కడిగి, గిన్నెలు తూము దగ్గర పడేసింది. తనకి ప్రొద్దు కూకగానే కళ్లు ఏమిటో మసగ్గా వుంటాయి. చేతికేదీ పట్టిచ్చినట్లుండదు. అందుకే చీకటి పడకుండా వండేద్దామనుకుంటుంది. కూర ఒకటీ పోపులో వేసుకో అమ్మా, చీకటి పడ్డాక అని తనంటే, కుసుమకి పట్టదు.

ఇల్లు చీపురుతో కడగనిదే శుభ్రంగా ఉండదుట దానికి. ఉన్నది కాస్త వంటిల్లు. అక్కడే దేముడు. అక్కడే కుంపటి. ఆ చీపురు నీళ్ళు చిందుతాయి. తను చేత్తోనే నీళ్లు తోసేస్తుంది. దేముడికి ఒక్కనాడూ సవ్యంగా యిన్ని పూవులతో పూజ చేసిందీ లేదు. ఎంగిలి నీళ్లు కూడా. అపచారం.

వాసుతో అన్నది - 'పూజకి పూలుండటం లేదు. ఒక్క గన్నేరు మొక్కో, మందారమొక్కో తెచ్చి పెట్టరా" అని "ఎందుకూ- యిది మన స్వంత యిల్లా - మొక్కలూ, మానులూ పెంచడానికి?" అన్నాడు.

ఒంట్లో ఓపికగానే వుంది మొక్కలకి నీళ్లు పోసుకోకపోలేదు. కానీ ఏమీ తోచనట్లుగా వుంటుంది. ఎవరితో మాట్లాడుతుంది. - కడుపుకి యింత తింటోంది కానీ - వంట బట్టినట్లుండదు. మధ్యాహ్నం కాగానే ఏదైనా నోట్లో వేసుకోవాలనుంటుంది. "కుసుమా, శెనగపప్పు మర పట్టించనా? కాస్త కారప్పూస దూస్తాను" అన్నది.

"ఎందుకొచ్చిన చాకిరీ? ఒక బేడ పెడితే, యింత పొట్లం వస్తుంది" అన్నదది. అన్నదే కానీ దానికి పొట్లం తేవడమే కుదరలేదు. దాన్ని తప్పు పట్టాలని కాదు గానీ, ఎన్నో పనులు వాళ్ళకి - గుర్తుంటాయా?

తనకేమిటో ఎవర్నీ అడక్కుండా ఏ పని చేయాలనిపించదు. కూడబలుక్కుని ఒక పని చేస్తే ఎంతో సులువుగా వుంటుంది. దానికి ఆ పుస్తకాలతోనే సరిపోతుంది. వాడు ఎన్నడూ దగ్గరవచ్చి కూర్చుని ఒక్క మాట మాట్లాడే అలవాటు లేదు.

ఇంక మడిబట్ట ఆరగట్టుకోవాలి. ఇప్పుడింకా ఫరవాలేదుగానీ, రెండు వానలు పడితే, మరో బట్ట లేకపోతే కష్టం. ఆరవు ఎప్పటికీ. తడి బట్టతోనే ఎన్ని నీళ్లో మోసి తెచ్చుకునేది చిన్నప్పుడు. ఇప్పుడు – అమ్మో, సాయంత్రానికే ఊష్ణం తగులుతుంది.

మధ్యాహ్నం ఒంటి గంటైంది. ఎండ తీవ్రంగానే వుంది. ఇల్లా వున్నదే సాయంకాలమయ్యేసరికి మబ్బుపట్టి వాన కురుస్తుంది. ఒక్కటే ఉక్క, పురుగులు. వాతావరణాన్ని విమర్శించుకుంటూ కుసుమ, ఆమె ఫ్రెండు లక్ష్మి స్కూలు గేటు దగ్గరకు వచ్చారు. రిక్షా కేకేసి బేరమాడింది లక్ష్మి. "దోవలో కూరలు కొనాలి" అంటుందామె. "నీకేమీ లేదు. హాయిగా అత్తగారు చేసిపెడతారు కాబోలు" అన్నది. కుసుమ తలూపింది. లక్ష్మి కొంచెం ఆగి నవ్వుతూ అంది "నేనైనా ఏమీ చేయను. నేను చేస్తానండీ మీరు కూర్చోండి అంటేనే ఆవిడకి అంత సంబరం. ఒక్క పూట చేశానని పేరే కానీ, అన్నీ ఆవిడే అమర్చిపెడతారు. పెద్దవాళ్ళకి అంతేనోయ్! మాట, సెంటిమెంటు ముఖ్యం. ఏమి చేశామన్నది కాదు" అన్నది.

కుసుమ మాట్లాడలేదు. కూరలు కొన్న తరువాత అరటి పళ్ళు కొన్నది. శనివారం ఫలహారం. "వంట మనం ఈపూట తప్పని సరిగా చేయాలి. ఉపవాసం వున్న మనిషి చేత చేయించడానికి మనకి ఎలా మనసొప్పుతుంది చెప్పు. మీకు లేవేమిటి శనివారాలూ?" అన్నది లక్ష్మి.

"మా అత్తగారికున్నది. ఆవిడేం తింటున్నారో నాకు తెలియదు మరి" అన్నది కుసుమ.

రెండు అడుగులు వేసి రిక్షా ఎక్కబోతూ, వెనక్కి వెళ్లి ఒక అరడజను అరటి పళ్ళు కొన్నది ఆమె కూడా.

రిక్షా కదిలి కొంత దూరం వెళ్లాక లక్ష్మి మెల్లగా నవ్వింది. "మీ అత్తగారు యీ వేళ నిన్ను తక్షణం కొడుకు తల్లివి కమ్మని దీవిస్తుంది" అన్నది. కుసుమ ముఖం చిట్లించింది. "ఏం అంత గొప్పా ఏమిటీ అరటి పళ్ళు?" అన్నది.

ఇంటికి వెళ్ళి భోంచేసేశాక పడుకోబోతూ, కిటికీలో వున్న అరటి పళ్ల వంక చూసింది. అవి తీసుకెళ్లి వంటింట్లో పడుకున్న అత్తగారి దగ్గర పెట్టింది. "శనివారం కదా – రాత్రి ఫలహారం చేస్తారని తెచ్చాను" అన్నది. కుసుమ యిల్లా అంటోంటే ఆమె బోసి నోరు తెరిచి నవ్వింది. ఆ ముఖంలో ఆ నవ్వు, చెమర్చిన కళ్లలోని సిగ్గు చూస్తే కుసుమ మనస్సులో ఏదో తెలియని కొత్త భావం నిలబడింది.

"నాకెందుకమ్మా యిన్ని – అబ్బాయీ, నువ్వు తీసుకోండి" అంటూ ఆవిడ వాటిని చేతిలోకి తీసుకుంది.

నిద్ర లేచేసరికి అత్తగారి మాటలు వినబడుతున్నాయి. ప్రక్కవాటా ఆవిడతో మాట్లాడుతోంది. "ముప్పావలా కిస్తున్నాడు? ఏమో మరి – మాకోడలు యిందాక కొంది. ఎంతకి తెచ్చిందో పెద్ద పెద్ద పళ్లు. శనివారం కదా మీకోసం పట్టుకొచ్చాను అంటోంది. బంగారు తల్లే. పది మంది కుమారుల తల్లివి కమ్మని దీవించాను. ప్రొద్దునే అనుకున్నాను అరటి పళ్ళు ఎలా యిస్తున్నారో. ఒక్కటి తింటే కడుపులో చల్లగా వుంటుందని. రేపు బ్రాహ్మడు వస్తాడు. నైవేద్యం పెట్టిన పండు, రామనామాల బియ్యం, ఒక ఆనపచెక్క యిస్తినా అంటే – నే చేసే పుణ్యం అక్కడికది చాలు" అంటోంది.

కళ్లు తెరచిన కుసుమకి కిటికీ దగ్గరగా వున్న చెట్టుకి కొత్తగా పట్టిన నవనవలాడే చిగుళ్లు అందంగా గాలికి వూగుతూ కనబడ్డాయి.

**– జయశ్రీ మాస పత్రిక**